క్లుప్తంగా

జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి పనుల జోరు



నాగులాపల్లిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైస్ ఎంపీపీ దేవి

మునగపాక: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఒకవైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వైస్ ఎంపీపీ చిందాడ దేవి అన్నారు. నాగులాపల్లిలోని పైడమ్మపేట వీదిలో రూ.2.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆమె గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, పాలసంఘ అధ్యక్షుడు దొడ్డి బుజ్జి, వైఎస్సార్‌సీపీనేత మళ్ల మాణిక్యం పాల్గొన్నారు.

అణుకు గిరిజనులకు సంఘీభావం

కోటవురట్ల : గిరిజనులు 21 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. అణుకు గిరిజనులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సీపీఎం బృందం గురువారం సందర్శించి సంఘీభావం తెలిపింది. లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా అణుకు గ్రామానికి రోడ్డు వేయాలని, గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించేంత వరకు దీక్షను విరమించరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల నాయకుడు జి.డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు



దిమిలి పీహెచ్‌సీలో సమావేశమైన కమిటీ సభ్యులు

రాంబిల్లి : దిమిలి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఇక్కడి పీహెచ్‌సీలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఎమ్మెల్యే కన్నబాబురాజు సహకారంతో సెజ్‌లో పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులతో ఈ పీహెచ్‌సీలో అదనపు గదులు నిర్మాణంతో పాటు వైద్య పరికరాలు కొనుగోలు చేస్తామని ఎంపీపీ శిరీష శ్రీనుబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి. భాగ్యవతి, ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, వైస్ ఎంపీపీ కొటాపు లక్ష్మీవడ్డి కాసులు, సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థులను పరీక్షిస్తున్న ఎంఈవోలు రామారావు, శ్రీజోష్

కోటవురట్ల : మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో-1 టి.రామారావు, ఎంఈవో-2 డి.శ్రీజోష్ సూచించారు. స్థానిక కేజీబీవీని గురువారం సందర్శించిన ఇద్దరు ఎంఈవోలు వివిధ అంశాలపై తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, స్టాక్, డైనింగ్ హాల్ పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ అనేక సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థినులు లక్ష్యాన్ని ఏర్పరుచుకుని పట్టుదలగా చదవాలని సూచించారు. కేజీబీవీ ఎస్‌వో సరోజినీదేవి పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

కోటవురట్ల : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం

- యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు
- కొక్కిరాపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో తోడ్పడుతుందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. గురువారం యలమంచిలి పట్టణం కొక్కిరాపల్లి సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యాక్రమంలో భాగంగా లబ్ధిదారులకు 11రకాల ధృవీకరణ పత్రాలను ఎమ్మెల్యే కన్నబాబు రాజు, మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ , వలంటీరు వ్యవస్థను స్థాపించి నవరత్నాలు పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి ఎక్కడా అవినీతి చోటు చేసుకోకుండా పారదర్శకమైన పరిపాలనను అందిస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం పట్టణంలో ఎంతో మంది ప్రజలకు ఉపయోగకరంగా మారిందని అన్నారు.

గతంలో ధ్రువపత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు ఎంతో మందికి సకాలంలో వారికి అవసరమైన ధ్రువపత్రాలు సకాలంలో అధికారులే వారి వద్దకు వచ్చి అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరావు, పట్టణ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర తహశీల్దారు రాణీ అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ వైయస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకున్న ఘనత జగనన్నదే



బంగారమ్మపాలెంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



ప్రకృతి వ్యవసాయ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : మత్స్యకారులకు వేట నిషేధం కాలంలో సక్రమంగా నగదు అందజేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మత్స్యకార గ్రామం బంగారమ్మపాలెం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వేట నిషేధం సమయంలో అర్హులైన కుటుంబాలకు రూ.10వేల నగదు అందజేయడంతో పాటు సంక్షేమ పథకాలు యథావిధిగా అందించారన్నారు కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథ్‌రావు, మాజీ ఎంపీటీసీలు రాజారావు, శ్రీపతిరాజు, నీలేంద్రరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద వెనుకబడిన తరగతుల వారికి 100 శాతం రాయితీ విత్తనాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుక బడిన నియోజకవర్గంలో ఇటువంటి కార్యక్రమాలు ప్రయోగాత్మకంగా చేపట్టాలని, ప్రకృతి వ్యవసాయం లాభాసాటిగా చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 37 మంది రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. అంతకుముందు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు మాట్లాడుతూ గ్రామాల్లో పెరట్లో కూడా ప్రకృతి వ్యవసాయ విత్తనాలు విత్తుకుని కూరగాయలు, ఇతర పంట ఫలాలు తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్లు వడ్డాది మధుసూధనరావు, పెదపాటి అమ్మాజీ, కొమ్మూరి కనకరావు, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ కోన లోవలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ డీపీఎం లచ్చన్న, పలువురు దళిత సంఘాల నాయకులు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, శీరం నరసింహమూర్తి పాల్గొన్నారు.

రైతులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



కృషి విజ్ఞాన కేంద్రం సమావేశంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అండగా ఉండి, రైతుల్ని ఆర్థికంగా ఆదుకుంటున్నాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, ఉత్తరాంధ్ర రైతు విభాగం ఇన్‌ఛార్జ్ చిక్కాల రామారావు అన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పీఎల్ పురం వద్ద నున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గల రైతు భరోసా కేంద్రంలో పీఎం కిసాన్ సమ్మేళన్‌పై రైతులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతులకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలు పరిష్కరం దిశగా ప్రణాళిక సిద్ధం చేసారన్నారు. పంటల పెట్టుబడి నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పీఎం కిసాన్ నిధితో కలిపి సంవత్సరానికి రూ. 13,500 జమ చేస్తుందన్నారు. రైతులు వరినార్లు వేసినప్పటి నుంచి ధాన్యం కొనుగోలు వరకు ప్రభుత్వం రైతులకు సహాయం అందిస్తుందన్నారు. అనంతరం సీనియర్ బీజేపీ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మేళన్ నిధి ద్వారా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతి రైతుకి సాలీనా రూ.6వేలు జమ చేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ రాజస్థాన్‌లో జరిగిన సమావేశంలో రైతులకు 14 వ విడత నగదును రైతుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా బటన్ నొక్కి ప్రారంభించారన్నారు. అనంతరం నాయకులు, కృషి విజ్ఞాన సిబ్బంది, రైతులు రాజస్థాన్‌లో పీఎం టెలి ద్వారా ప్రసంగాన్ని తిలకించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పీఎల్ పురం సర్పంచ్ పడాల సోమన్నదొర, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్‌ఖన్నా, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు డాక్టర్ కె.శైలజ, వ్యవసాయ శాఖ ఏడీ ప్రసాద్, ఏవో పి.ఆదినారాయణ, ఉద్యానవనశాఖాధికారి రాధిక, తాండవ రైతు ఉత్పత్తి దారుల సంఘం సీఈవో జీవివి సత్యనారాయణ పాల్గొన్నారు.

వర్షంతో ఊరట

రాంబిల్లి: మండలంలో మంగళవారం పలు గ్రామల్లో వర్షం పడింది. సుమారు 10 నిమిషాల పాటు భారీ వర్షం కురిసింది. దిమిలి, నారాయణపురం, కట్టుబోలు తదితర గ్రామాల్లో వర్షం నీరు రోడ్లపై ప్రవహించింది. నారుమడులు , దుక్కి పనులకు ఈ వర్షం ఉపయోగపడుతుందని పలువురు రైతులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ ఇంకా వర్షాలు ఆశించినంతగా పడడం లేదు. దీంతో రైతులు నిరాశగా ఉన్నారు. వర్షాలు పడితే వరి విత్తనాలు వేసేందుకు రైతులు సన్నద్ధంగా ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన చేపట్టిన విద్యుత్ ఉద్యోగులు

పాయకరావుపేట : విద్యుత్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని పట్టణంలో గల సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శించారు. విద్యుత్ రంగంలో పర్మనెంట్ కార్మికులకు జీతభత్యాల బకాయిలు, కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులేషన్ కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎల్.నూకరాజు, సిహెచ్.సత్యనారాయణ, వై.రాజయ్య పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద నాణ్యతలో రాజీ లేదు



ఈబీసీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో

నక్కపల్లి : పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పెట్టే మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి కుంచం నరేష్ అన్నారు. గురువారం ఆయన నక్కపల్లి ఈబీసీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వండుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని, విద్యార్థులకు సరిపడా ఆహారం పెట్టాలని అన్నారు. అనంతరం పాఠశాలలో అమలు చేస్తున్న టరల్ అభ్యాసనా సామర్థ్యాలను అంచనా వేసి రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల ప్రణాళికలు సిద్ధంగా ఉంచాలన్నారు. పఠనా నైపుణ్యం పెంపొందించాలని, అభ్యాసన కృత్యాలతో బోధన చేయాలని సూచించారు.

కిసాన్ సమృద్ధి కేంద్రం సందర్శన



కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ నేతలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేటలోని కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని బీజేపీ నేతలు పరిశీలించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో భాగంగా మోదీ ప్రసంగాన్ని టీవీలో ప్రత్యక్ష ప్రసారం సహాయంతో వీక్షించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంతిన భక్త సాయిరాం మాట్లాడుతూ పీఎం మోదీ కిసాన్ సమ్మాన్ నిధిని విడుదల చేశారని, ఎరువుల కొరత లేకుండా, నకిలీ ఎరువులు లేకుండా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బీజేపీ నియోజక కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, హనుమంతరావు, ఇబ్రహీం భాషా, కూండ్రపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

మునగపాక : మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 11 వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ హాలులో జరిగే ఇంటర్వ్యూలకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తుదారులు హాజరుకావాలని ఆయన కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



బాల్య వివాహాలను అరికట్టాలంటూ గోడ పత్రిక విడుదల చేస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను అరికట్టేందుకు సహకరించాలని సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ సంతోషి కోరారు. నాగులాపల్లి సచివాలయం వద్ద బాల్య వివాహాలకు సంబంధించిన గోడ పత్రికలను ఆమె గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల కార్మికులతో వెట్టి చాకిరి చేయించినా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మహిళా పోలీసు భీమిశెట్టి సరోజ పాల్గొన్నారు.

కలాంకు ఘన నివాళులు



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

యలమంచిలి : భారత మాజీ రాష్ట్రపతి దివంగత ఎ.పి.జె అబ్దుల్ కలాం వర్ధంతి గురువారం పేట బయ్యవరం పాఠశాలలో నిర్వహించారు. కలాం చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి అంజలి ఘటించి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు బొడ్డేడ సత్యనారాయణ మాట్లాడుతూ అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా భారత రక్షణ వ్యవస్థలో కీలకమైన అణు ఆయుధ సంపత్తిపై ప్రత్యేక పరిశోధనలు జరిపి దేశ ఖ్యాతిని చాటి చెప్పడంతో పాటు రాష్ట్రపతిగా విశేష సేవలందించిన ఆయన సేవలు మరువరానివని బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.

పొంగి ప్రవహిస్తున్న నదులు



కొత్తూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మేజర్ శారద

రాంబిల్లి : మేజర్, మైనర్ శారద నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు వచ్చి నదుల్లో చేరుతుంది. దీంతో నదుల్లో నీరు పుష్కలంగా ప్రవహిస్తోంది. సాగునీటి కాలువల్లోనూ పరవళ్లు తొక్కుతూ నీరు ప్రవహిస్తోంది. ఈ నీరుతో వరినాట్లు పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయని రైతులు పేర్కొన్నారు.

అబ్దుల్ కలాం ఆశయ సాధనకు పాటుపడాలి



కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మునగపాకలోని బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలో గురువారం భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం జరిగింది. కలాం చిత్రపటం వద్ద వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశం అభివృద్ధి సాధించడంలో అబ్దుల్ కలాం పాత్ర కీలకమైందన్నారు. మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, సచివాలయ కన్వీనర్లు టెక్కలి కొండలరావు, గుంట్ల అప్పారావు, ఆడారి లక్ష్మణరావు, భరణి కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్‌లో బాలల స్నాతకోత్సవం



స్నాతకోత్సవం సందర్భంగా పట్టాలు పొందిన చిన్నారులు

పాయకరావుపేట : స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలలో (పెద్దబాలవనం) యు.కె.జి. విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించి, పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హాజరైన తల్లిదండ్రులతో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, వారి సర్వతోముఖాభివృద్ధికి విలువనిస్తున్నారని ఇది శుభపరిణామమని తెలిపారు. సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులతో తల్లిదండ్రులు రోజుకు కనీసం గంట సమయమైనా గడపాలని, వారితో కథలు, వివిధ విషయాలు చర్చించడం ద్వారా వారికి విషయ పరిజ్ఞానం పెరిగి విజ్ఞానవంతులుగా తయారవుతారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సందర్శన

మునగపాక : మునగపాక శాఖా గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సీహెచ్. వెంకటరావు సందర్శించారు. రికార్డులు పరిశీలించారు.

ప్రతిరోజు గ్రంథాలయానికి వస్తున్న పాఠకులకు సంబంధించిన పుస్తకం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమయ్యే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు కూడా పరిశీలించారు. ఆయన వెంట గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ దృష్టికి సమస్యలు



స్టాండింగ్ కమిటీ సమావేశంలో సమస్యలను వివరిస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి

కోటవురట్ల : జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మండలంలోని పలు సమస్యలను వివరించినట్టు జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి తెలిపారు. కోటవురట్లలోని సీహెచ్‌సీలో ఎనస్తీషియన్, ఫిజీషియన్ రెగ్యులర్ పోస్టులు వేయాలని, ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఇంటర్ విద్యతో పాటు ఎంసెట్ శిక్షణ ఇవ్వాలని, జల్లూరు వంతెనను పూర్తి చేయాలని, రామచంద్రపురం జంక్షన్ నుంచి అడ్డురోడ్డు వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, జల్‌జీవన్ మిషన్‌లో కాంట్రాక్టర్ తవ్వి వదిలేసిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరడం జరిగిందన్నారు. సచివాలయాలలో సిబ్బంది, కార్యదర్శుల కొరత గురించి వివరించినట్టు తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని డీపీవో వివరణ కోరినట్టు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



తిమ్మరాజుపేటలో కుట్టు శిక్షణను ప్రారంబిస్తున్న దృశ్యం

మునగపాక : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని అనకాపల్లి సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు శ్రీ కృష్ణరాజు పిలుపునిచ్చారు. తిమ్మరాజుపేట సత్యసాయిబాబా ఆలయంలో గురువారం మహిళలకు కుట్టు మిషన్, ఫ్యాషన్ డిజైన్‌కు సంబంధించి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా కుట్టుమిషన్‌లు దోహదపడతాయన్నారు. శిక్షణలో నైపుణ్యం పెంపొందించు కోవాలన్నారు. 40 రోజుల పాటు రోజుకు 3 గంటలు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి అన్నం రాజశేఖర్, మునగపాక మండల ఇన్‌చార్జి సరిసా శివ గణేష్, భజన మండలి సభ్యులు రమణ, ఆదిబాబు, ట్రైనర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

గంబూసియా చేపలతో దోమల నియంత్రణ



గంబూసియా చేపల్ని బావిలో విడిచిపెడుతున్న భాస్కర్

అనకాపల్లిటౌన్: గంబూసియా చేపలతో దోమలను నిరోధించవచ్చని 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్ అన్నారు. పట్టణంలోని గవరపాలెం శాంతినగర్ బావిలో గురువారం ఆయన గంబూసియా చేపలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలున్న ప్రాంతంలో ఈ చేపలను వేస్తే దోమల లార్వాను ఇవి తినడం ద్వారా, దోమల వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ ఇ-చలానాలపై స్పెషల్ డ్రైవ్



ద్విచక్రవాహనానికి ఇ-చలానా రాస్తున్న ఎస్ఐ రమేష్

అనకాపల్లిటౌన్: ద్విచక్రవాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే సహించేది లేదని ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన గురువారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ-చలానా చెల్లించని 150 వాహనాల నుంచి చలానా చెల్లించేలా చర్యలు చేపట్టామన్నారు. చలానాల రూపంలో రూ.30 వేలు ఆదాయం సమకూరిందన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారిపై విద్యుత్ కండక్టర్ మార్పిడి పనులు నిర్వహించనున్న దృష్ట్యా నూతలగుంటపాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం తదితర గ్రామాల్లో గృహ, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అంతరాయాన్ని గమనించి సహకరించాల్సిందిగా కోరారు.